జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


బుధవారం | 30-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 324 పేజీలు: 4 వెల : రూ.7



* బీసీ రాయితీ రుణాల పథకంలో అట్టడుగు ప్రదర్శన * ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు * దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఒకటే పరిస్థితి * ఒక్కో గణాంకం.. ప్రభుత్వ సంకల్పానికి గుణపాఠమే * మొత్తం దరఖాస్తుదారులు సుమారు 30,000 మంది * జిల్లాకు మంజూరైన యూనిట్లు కేవలం 3,141 మాత్రమే * బ్యాంకర్ల వద్దకు వెళ్లిన దరఖాస్తులు 638 * రుణం మంజూరైంది.. 502 మంది * ఎంపికైన 1,840 దరఖాస్తులకూ ఎమ్మెల్యేల ఆమోదం రాకపోవడం విచారకరం * రాజకీయ ఒత్తిడుల కారణంగా ఈ వైఫల్యం నమోదు

# శ్రీకాకుళం జిల్లా..
# వెనుక నుంచి ఫస్ట్!

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వెనుకబడిన తరగతులకు సబ్సిడీ రుణాల పథకం అమలు విషయంలో శ్రీకాకుళం జిల్లా నిర్లక్ష్యంతో ప్రత్యేకంగా నిలిచింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే అట్టడుగు స్థానంలో నిలిచింది. అంటే 26వ స్థానం అన్నమాట. ఈ జిల్లాలో అమలులో పెట్టబడిన రుణాల ప్రగతిని పరిశీలిస్తే, ఇది దారుణంగా




వెనుకబడిన స్థితిలో ఉందని స్పష్టంగా తెలుస్తోంది. దాదాపు 30,000 మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, జిల్లా ప్రస్తుత పరిస్థితి ఏంటంటే, కేవలం 3141 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయి. మరింతగా వివరించాలంటే, అందులోనూ 1840 దరఖాస్తులు మాత్రమే బ్యాంకులకు పంపబడ్డాయి, ఇంకా మరో కష్టమైన విషయం ఏంటంటే వాటిలో 638 మాత్రమే ఆమోదించబడ్డాయి. చివరగా అందులోనూ 502 మందికి మాత్రమే రుణం మంజూరైంది. ఈ పథకం అమలు విషయంలో కొన్ని ప్రాంతాలు అట్టడుగు స్థానంలో నిలిచాయి. కొన్ని మండలాలు మున్సిపాలిటీల పనితీరు బట్టి, ఈ పథకం తన నిర్లక్ష్యాన్ని చాటింది.

ఆమదాలవలస: 0 శాతం
పొందూరు: 0శాతం
ఎచ్చెర్ల: 0శాతం
ఇచ్ఛాపురం మున్సిపాలిటీ: 0శాతం
జలుమూరు: 0శాతం (103 లక్ష్యంతో)
పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ: 0శాతం
హీరమండలం: 0శాతం

ఇదిలా ఉంటే ఎమ్మెల్యేల సిఫారసులతో పథకానికి ఎంపికైన కొందరికి సిబిల్ స్కోర్ లేకపోయినా, నియోజకవర్గాల శాసనసభ్యులు రుణం మంజూరు చేయాలని బ్యాంకులపై ఒత్తిడి తెస్తున్నారు. మరికొందరిని తమ రాజకీయ ప్రమేయంతో జాబితాల్లోకి అనుమతించకుండా నిలిపేశారు.. ఇది వివక్ష, అన్యాయానికి నిదర్శనం. జిల్లాలో అభ్యర్థుల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా పథకం పరిపాలన సాగుతోంది. ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక స్వావలంబన సాధించడం. అయితే ఇక్కడ మధ్యవర్తుల ప్రమేయం, రాజకీయ నేతల క్రీడ బారిన పడి ఆ లక్ష్యం అడుగంటి పోయింది. ముఖ్యంగా మండల స్థాయిలో పూర్తిగా 0 సాయికి దిగిపోయిన ఫలితాలు చూస్తే, అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పథకానికి నిధులు ఉంటే సరిపోదు, వాటిని పారదర్శకంగా, బాధ్యతతో అమలు చేయాల్సిన అవసరం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న విధానం చూస్తే ఇది సామాజిక న్యాయాన్ని కించపరిచే ప్రయత్నంగా నిలుస్తోంది. జిల్లా అధికారుల నిర్లక్ష్యం, అన్యాయ ఒత్తిళ్లు, అనేక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా, ఈ పథకం శ్రీకాకుళం జిల్లాలో మరింత వెనుకబడిన స్థితికి వెళ్లిపోయింది. సంబంధిత శాఖలు, సిబ్బంది, అధికారులు తమ బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించకపోవడం, పేద బీసీల ఆశలను పూర్తిగా నట్టేట ముంచేస్తుంది.

## క్రైం కార్నర్

### పెళ్లింట విషాదం



**సరుబుజ్జిలి, ఏప్రిల్ 29 (వార్త):** పెళ్లింట విషాదం చోటుచేసుకున్న ఘటన సరుబుజ్జిలి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం గ్రామానికి చెందిన గూడాల అప్పారావు(57) భార్య కుమారితో కలిసి పెళ్లికార్డులు పంచి సోమవారం రాత్రి ఇంటికి బయల్దేరారు. అలికాం-బత్తిలి రహదారిపై వస్తుండగా ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా రావడంతో బ్రేక్ వేయగా వాహనం బోల్తా పడింది. అప్పారావుకు తీవ్ర గాయాలు కాగా.. భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అప్పారావుకు రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పెళ్లింట విషాదం నెలకొనడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ మెండ జనార్దనరావు తెలిపారు.

### మద్యానికి బానిసై..

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం కంద్రవీధికి చెందని పూర్ణచంద్ర బెహరా (37) తాగుడికి బానిసైపోయాడు. సంపాదించిన సొమ్మును మద్యానికే వెచ్చిస్తుండటంతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. సోమవారం రాత్రి కూడా కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ తలెత్తగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. పూర్ణచంద్ర భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

### పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

**శ్రీకాకుళంక్రైం:** శ్రీకాకుళం నగరానికి చెందిన దాసరి రాజాపై మంగళవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఒకటో పట్టణ ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు. నగరంలోని ఓ వీధికి చెందిన బాలికను లైంగిక వేధింపులకు గురి చేసి బలాత్కారం చేసినట్లు ఫిర్యాదు రావడంతో అదుపులోకి తీసుకున్నారు. ఒకటో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మొహిద్దీన్ జమారుత్ బేగమ్ కమాలుద్దీన్ వద్ద హాజరుపరచగా తొమ్మిది రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

### చింతలబడవంజలో చోరీ

**ఎల్ఎన్‌పేట:** ఎల్ఎన్‌పేట మండలం చింతలబడవంజ కాలనీలో చోరీ జరిగింది. రొంపివలస రమణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కిటికీ దగ్గర పెట్టిన తాళంతో ఇంటి తలుపులు తీసి బీరువా తాళం పగల గొట్టి మూడు తులాల బంగారం, 10 తులాలు వెండి వస్తువులు, రూ.9 వేలు నగదు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు. సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మంగళవారం ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, సరుబుజ్జిలి ఎస్సై ఎస్.బాలకృష్ణతో పాటు క్లూస్‌టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాలు సేకరించారు. తెలిసిన వాళ్లే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## అటవీ శాఖ పనులపై విజిలెన్స్ విచారణ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త):** విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా గారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు విభాగం ఎస్పీ బర్ల ప్రసాదరావు పర్యవేక్షణలో అటవీ శాఖ చేపట్టిన వివిధ పనులను పరిశీలనలో భాగంగా కాశీబుగ్గ రేంజ్, మందస సెక్షన్‌కు సంబంధించి అటవీ శాఖ చేపట్టిన మొక్కల పెంపకం, ట్రెంచ్ నిర్మాణ పనులు విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ శాఖ డీఎస్పీ వై.గోవిందరావు, డీఈ సత్యనారాయణ, అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్ కుమార్, ఏఈ గణేష్ పాల్గొని రికార్డులలో పేర్కొన్న విధంగా పనులు జరిగింది, లేనిది పరిశీలించారు. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని అధికారులు పేర్కొన్నారు.



# నీట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

### * అన్ని శాఖల సమన్వయంతో నిర్వహణకు చర్యలు * జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29 (వార్త):** మే 4న జరిగే నీట్ పరీక్షలను అన్ని శాఖల సమన్వయంతో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి మారెళ్ళ వెంకటేశ్వరరావు నీట్ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఆర్‌జేయు కేటీ - ఎచ్చెర్ల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ - గుజరాతీపేట, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల - శ్రీకాకుళం, కేంద్రీయ విద్యాలయ - శ్రీకాకుళం ఉన్నాయి. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉదయం 11 గంటల నుండి 1:30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి ఉండదని అధికారులు స్పష్టం




చేశారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌లో పొందుపరిచిన నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందిగా సూచించారు. ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ పూర్తిగా నిషేధించినట్టు చెప్పారు. ప్రతి కేంద్రంలో విద్యుత్ అంతరాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జనరేటర్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అలాగే ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది, అత్యవసర మందులతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల రవాణా కోసం తగిన బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కిరణ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, నీట్ సిటీ కోఆర్డినేటర్ సుహాయిబ్ ఆలం, చీఫ్ సూపరిండెంట్ పీవీ రమణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీచ్ ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### * జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



**శ్రీకాకుళం, ఏప్రిల్ 30 (వార్త):** బారువ బీచ్ ఫెస్టివల్‌ను మే 3, 4 తేదీల్లో ఘనంగా కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌నకు మండల స్థాయి అధికారులు తమ మండల కేంద్రాల్లో, జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ కార్యాలయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ స్పోర్ట్స్, సంప్ర దాయ బీచ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బీచ్ ఫెస్టివల్ ప్రత్యే కంగా ఉండాలి. సందర్శకులకు తాగునీరు, శౌచాలయాలు, పారిశుధ్య వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెన్షన్ పంపిణీ పకడ్బందీగా ఉండేలా చూడాలని తహసీల్దార్లకు స్పష్టంగా చెప్పారు. మే 1న ఉదయం నుంచే పంపిణీ ప్రారంభించాలన్నారు. బుధవారం నాటికి డబ్బులు విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఎప్పటిలాగే పనిచేస్తుందని వివరించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్ల వివరాలు, అనుమతులు లేని లేఅవుట్ల సమాచారం శుక్రవారం నాటికి కలెక్టర్ కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. రీ సర్వేలో కనీసం 10 శాతం క్షేత్రస్థాయిలో అధికారులే పరిశీలించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటిపారుదల అధికారులకు సూచించారు. గోకులం షెడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి, పశువులకు నీటి సౌకర్యం కల్పించాలని, ఫామ్ పాండ్లు పూర్తి చేయాలని, సూర్యఘర్ పథకం అమలులో జిల్లా స్థానం మెరుగుపరచాలని సూచించారు. కోర్టు కేసులకు సంబంధించి ఉదాసీనత పనికిరాదని, అన్ని శాఖల్లో లీగల్ సెల్ సమర్థవంతంగా పని చేయాలని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో కచ్చితత్వం ఉండేలా చూసుకోవాలని, ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# సేవకు మంచి గుర్తింపు

### * బీసీల వెన్నెముక టీడీపీ * సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రవికుమార్ రుణపడి ఉంటా * డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

**ఆమదాలవలస, ఏప్రిల్ 29 (వార్త):** టీడీపీలో కష్టపడి, సేవలు అందించే వారికి పార్టీ అధిష్టానం ఎప్పుడూ సముచిత స్థానం కల్పిస్తుందని డీసీసీబీ అధ్యక్షుడిగా నియమితులైన శివ్వాల సూర్యనారాయణ అన్నారు. ఆమదాలవలస టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నుంచి నేటి వరకు పార్టీలోనే ఉంటూ అభివృద్ధి కోసం పని చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ నమ్ముకున్న వారికి ఎప్పుడైనా మంచి స్థానం దొరుకుతుందని అనడానికి తన నియామకమే నిదర్శనమని తెలిపారు. ఎంతోమంది రాజకీయ నాయకులు పార్టీలు మారినప్పటికీ టిడిపి సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశానని వివరించారు. పార్టీ అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు రుణపడి ఉంటానన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతోనే తనకు ఈ పదవి లభించిందన్నారు. రాజకీయ కక్షల వల్ల తన తండ్రిని 1984 ప్రాంతంలో కోల్పోవలసి వచ్చిందన్నారు. సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీటీసీగా, జడ్పిటిసిగా పార్టీ పరంగా ఎన్నో పదవులు చేపట్టామన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పటిష్టపరిచి రైతులకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానని సూర్యనారాయణ తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, టీడీపీ నాయకులు సంపదరావు మురళీధర్, అంబల్ల రాంబాబు, పల్లి సురేష్, నందివాడ గోవిందరావు, మీసాల రామారావు పాల్గొన్నారు.

## డీసీసీబీ చైర్మన్‌కు బ్యాంకు అధికారుల సన్మానం

**శ్రీకాకుళం:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) నూతన చైర్మన్‌గా నియమితులైన శివ్వాల సూర్యనారాయణకు మంగళవారం బ్యాంకు అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామంలో ఆయన నివాసంలో చైర్మన్‌ను కలిసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ దత్తి సత్యనారాయణ, జనరల్ మేనేజర్లు వరప్రసాద్, జగదీశ్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు సత్యనారాయణ, రమేష్, సునీల్, బసవలింగం, ఏ.జి.యమ్స్ దశరధరామ్, ఆర్.కె. భాస్కరరావు, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మురళీధర్, జనరల్ సెక్రటరీ కామరాజు తదితరులు పాల్గొన్నారు.







## విద్యార్థులకు నీతి కథల బోధన

**మందస, ఏప్రిల్ 29(వార్త):** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం మందస శాఖా గ్రంథాలయంలో విద్యార్థిని విద్యార్థులకు నీతి కథలు చదివించారు. జె.విజయలక్ష్మి గ్రంథాలయ అధికారిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## అగ్రహారంలో అధ్వానంగా కాలువలు

**సరుబుజ్జిలి, ఏప్రిల్ 29 (వార్త):** తెలికిపెంట పంచాయతీ పరిధిలోని అగ్రహారం గ్రామంలోని మురుగుకాలువలు అధ్వానంగా మారాయి. కాలువలు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

## నేడు సామూహిక ఉపనయనాలు

**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** జై జగన్నాథ ఒడియ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కాశీబుగ్గ పూజారి వీధిలో 25మంది ఒడియ బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయన కార్యక్రమము నిర్వహిస్తున్నామని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి తెలిపారు. ప్రతి ఏడాది బ్రాహ్మణ సంఘ బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

## జాతి గర్వించదగ్గ వ్యక్తి మాడుగుల

**మెళియాపుట్టి, ఏప్రిల్ 29 (వార్త):** తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తులలో అష్టవధాని, మహా సహస్రవధాని, పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ఒకరని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ బ్రాహ్మణ సమైక్య శ్రీకాకుళం జిల్లా అధికార ప్రతినిధి జె.జె.ఎస్. ప్రతాప్ తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా పద్మశ్రీ అవార్డు అందుకున్న నాగఫణి శర్మను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్మానించి సత్కరించారన్నారు. పూర్వపు ప్రధాని పివి నరసింహారావు, పూర్వపు ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తదితర ఎందరో ప్రముఖులతో నాటి నుండి నేటి వరకు మహాసహస్రవధాని మాడుగుల నాగఫణి శర్మ ప్రశంసలు అందుకున్నారన్నారు.

## విజయ్ దేవరకొండ ఆదివాసులకు క్షమాపణ చెప్పాలి

**మందస, ఏప్రిల్ 29(వార్త):** రెట్రో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హీరో విజయ్ దేవరకొండ గిరిజనులను అవమానపరుస్తూ మాట్లాడారని, ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షులు జగన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గిరిజనులను పోరాటాలను ఉగ్రవాదులతో పోలుస్తూ కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. ఆదివాసీల్లా చరిత్ర, దేశంలో ఆదివాసులు పడుతున్న కష్టం, నష్టం గూర్చి తెలియకపోతే తెలుసుకుని మాట్లాడాలన్నారు.

## పహల్‌గాం మృతులకు నివాళి




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29 (వార్త):** పహల్‌గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబాలకు మాజీ సైనికోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోపింటి రాజులు రెడ్డి, దక్కాత విశ్వనాథ రెడ్డి, గరికిపాటి చరణ్, యు.శంకర్‌రావు, ఉమ్మయ్యా, దాసరి రాజు, చాట్ల లోహిదాస్, ఉప్పాడ ప్రశాంత్, కొండ శంకర్ రెడ్డి, హరినారాయణ, సాహు, మహాదేవ్ రెడ్డి, బైరాగిరెడ్డి, పట్నాయక్, సన్యాసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెన్నను కలిసిన అవినాస్



**శ్రీకాకుళం, ఏప్రిల్ 29 (వార్త):** శ్రీకాకుళం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన చౌదరి అవినాష్ మంగళవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## ఏయూలో ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

**సోంపేట, ఏప్రిల్ 29 (వార్త):** వైజాగ్‌లోని ఆంధ్రా యూనివర్సిటీలో సోంపేట నాట్యమండలికి నృత్య ప్రదర్శనకు అవకాశం దక్కడం ఆనందంగా ఉందని, తన జీవితం ధన్య మైందని నృత్య దర్శకురాలు బిందు అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ స్వర్ణోత్సవాలు సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో సోంపేట నాట్యమండలి ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంపీ భరత్, ఆంధ్ర యూనివర్సిటీ వీసీ, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ఉపన్యాసకులు, అధ్యా పకులు ఈ నృత్య ప్రదర్శనను తిలకించారు.




### నిబంధనల ప్రకారం

## ఓటర్ల జాబితా తయారు చేయాలి

### శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి సాయి ప్రత్యూష

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29 (వార్త):** ఓటర్ల జాబితాను నిబంధనలకు అనుగుణంగా కచ్చితత్వంతో తయారు చేయాలని శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి కె. సాయి ప్రత్యూష సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మరణించినవారి ఓట్లు, వివాహం జరిగినవారి ఓట్లు, రెండుసార్లు నమోదైన ఓట్లను గుర్తించి తొలగించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఓటర్ల వివరాల నిర్వహణ కోసం బూత్ స్థాయి అధికారుల మొబైల్ అనువర్తనం, ఈఆర్ఓ నెట్ వంటి వ్యవస్థల వినియోగంపై అవగాహన సాధించాలని, సంబంధిత వివరాలు అందించారు. తహసీల్దారు ఎస్. గణపతిరావు, ఉప తహసీల్దారు జి.కె. శ్రీనివాసరావు, తహసీల్దారు చక్రవర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి చేయూత


### ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 29 (వార్త):** అనారోగ్యంతో ఫిబ్రవరి 14న మృతి చెందిన హోంగార్డు పి. పైడి రాజు కుటుంబానికి ఆర్థిక చేయూతగా నగదు చెక్కును జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి అందజేశారు. హోంగార్డు పైడి రాజు సతీమణి రమ్య నకు హోంగార్డు విభాగం సహచర హోంగార్డు ఉద్యోగులు అందరు కలిసి ఆర్థిక సహాయంగా స్వతహాగా ఒక్క రోజు వేతనంగా ఇచ్చిన సుమారు 4.07 లక్షల నగదు చెక్కును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకుంటామన్నారు. ఏదైనా సమస్యలు ఉన్న నేరుగా సంప్రదించవచ్చునని భరోసా కల్పించారు. తోటి హోంగార్డుల మానవీయత అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సి.హెచ్. గోపినాథ్, ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి కుటుంబ సభ్యులు ఉన్నారు.

## కర్రసాముకు పూర్వవైభవం తీసుకురావాలి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29 (వార్త):** స్టార్ వాకర్స్ క్లబ్ సౌజన్యంతో కర్రసాము క్రీడాకారులకు మంగళవారం శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా స్టార్ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు మాట్లాడుతూ అంతరించిపోతున్న ప్రాచీన క్రీడలకు మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పూర్వ రోజుల్లో ఆత్మరక్షణ కోసం కర్రసాము నేర్చుకొనే వారని గుర్తు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ కర్రసాము క్రీడకు ప్రాణం పోస్తున్న యువ క్రీడాకారుడు, కోచ్ బలగ హర్షవర్ధన్ ను అభినందించారు. ఈ నెల30న వెస్ట్ గోదావరి జిల్లా కైకలూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కర్రసాము క్రీడాపోటీలకు వెళ్తున్న బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకన్నా ముందు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా రెండు రోజుల క్రితం పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కణితి శ్రీరాములును స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బీవీ రవిశంకర్, జి.లక్ష్మీ, నళినీ సుధాకర్, వూన్న నాగభూషన్. పొట్నూరు నాగేశ్వరరావు, ఎం.మల్లిబాబు, జేసీ పట్నాయక్, మెట్ట ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



### ఒడిశా మేకపోతుల మాంసం..

# పలాసలో విక్రయం

*** వీటిని తింటే రోగాలు గ్యారంటీ * పట్టించుకోని పశు, మున్సిపల్ అధికారులు**



**పలాస, ఏప్రిల్ 29(వార్త):** జబ్బుపడిన మేకపోతులను పలాస కాశీబుగ్గ జంటపట్టణాలకు తీసుకువచ్చి వాటి మాంసాన్ని కొందరు విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. వారికే కాసులే తప్ప ప్రజారోగ్యం పట్టడం లేదు. బయట నుంచి తీసుకువస్తున్న మేకపోతులు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా పరిశీలించాల్సిన పశువైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, దీనివల్ల పలాస–కాశీబుగ్గ జంట పట్టణవాసులతో పాటు మండలవాసులు రోగాల బారిన పడుతున్నారు. మంగళ, బుధ, ఆదివారం మూడు రోజుల్లో. కాశీబుగ్గలో మూడు ప్రాంతాలోనూ, పలాసలోని కొన్ని ప్రాంతాల్లోనూ వ్యాధి సోకిన, ముదురు మేకపోతుల మాంసం విక్రయిస్తున్నారు. చిన్న పూసురు పిల్లలు, నడవలేని మేకల మటన్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఈ మూడు రోజుల్లో సుమారు 100కు పైగానే మేక మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ మాంసం కిలో రూ.800 నుంచి రూ.1000 వరకూ విక్రయిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాధుల బారిన పడిన మేకపోతుల విక్రయంపై దృష్టి సారించాల్సివుందని జంట పట్టణవాసులు కోరుతున్నారు.

# ప్రశాంతంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

**మందస, ఏప్రిల్ 29(వార్త):** పలాస నియోజకవర్గం మందస మండలంలో మంగళవారం తాళ్లగురంటి, బుడార్సింగి, భోగాపురం గ్రామ పంచాయతీలలో ఆ పార్టీ మండల అధ్యక్షులు భావన దుర్యోధన అధ్యక్షతన పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికలు పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించామన్నారు. పార్టీ కోసం సమయం కేటాయించి పనిచేసే వారికే కమిటీలో చోటు ఉంటుందన్నారు. ఈ కమిటీలో వయస్సు, కులంతో పాటు మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లగురంటి అధ్యక్ష కార్యదర్శులుగా సవర హరికృష్ణ, రాయకో దొంబురులను బుడార్సింగి అధ్యక్షులుగా సంతోష్ కుమార్ గౌడ, మహానాయాక్ రమ్మలను భోగాపురం అధ్యక్ష కార్యదర్శులుగా పోలేటి ప్రభాకర్ , బబ్లు బెహరాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులతో మండల పార్టీ అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తమిరి భాస్కరరావు, డుంకూరు తిరుపతి, రట్టి లింగరాజు, తమ్మినేని ధనుంజయ, రాజాన మహేష్, మంగళ్ పాత్రో, బేసి ఈశ్వరరావు, ఆయా గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రాంపురం టీడీపీ నూతన కార్యవర్గం

ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస మండలం రాంపురం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ కొత్త కమిటీ సభ్యులను మండల నాయకులు, పంచాయతీ పెద్దలు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తామాడ తుంబనాదం, ప్రధాన కార్యదర్శిగా కోడ లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా జుత్తు రామారావులను ఎంపిక చేశారు. అలాగే సభ్యులుగా ఎస్.హరీష్, లైయాశెట్టి డిల్లేశ్వరరావు, తిమ్మల పున్నయ్య, బొడ్డు ఉమాపతి, రాకెట్ల ధర్మారావు, కర్మోజి శ్రీను, పలాస కృష్ణ ఎన్నికయ్యారు.




## చురుగ్గా రోడ్డు పనులు

**భామిని, ఏప్రిల్ 29 (వార్త):** భామిని మండలంలో మెయిన్ రోడ్డుపనులు చురుగ్గా సాగుతున్నాయి. బత్తిలి నుంచి మొదలైన రోడ్డు పనులు కొరమ కొత్తూరు వరకు పనులు నిర్వహిస్తున్నారు. గుంతల రోడ్డు వల్ల బత్తిలి నుంచి కొత్తూరు వెళ్లాలంటే గంటకుపైగా సమయం పట్టేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ రోడ్డు పనులకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు పనులు జరుగుతుండడంతో ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

*** ఎమ్మెల్యే గొండు శంకర్ * బలరాంపురంలో మత్స్యకారులకు భృతి పంపిణీ**

**గార, ఏప్రిల్ 29 (వార్త):** మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని బలరాంపురంలో మత్స్యకారుల సేవ పథకాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. తొలుత చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మత్స్యకారులకు మత్స్యకార భరోసాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో భృతికింద రూ.20 వేలు మత్స్యకారులకు అందజేశామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో చంద్రన్న బీమాను, సబ్సిడీలను రద్దుచేసి మత్స్యకారులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. మత్స్యకారుల సేవలో మంచి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. వేట నిషేధ కాల భృతిని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచుతూ మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచే దిశగా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో మత్స్యకార భరోసా అందుకున్న మత్స్యకారుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు కట్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, ప్రజలు, మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

**సంతకవిటి, ఏప్రిల్ 29(వార్త):** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు భరోసాగా నిలుస్తోందని రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రాజాం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంతకవిటి మండలం బూరడపేటకు చెందిన బగాది లోకనాథం ట్రైన్ ప్రమాదంలో గాయ పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో వారి కుమారుడు బగాది రవితేజకు రూ.నాలుగు లక్షల 89వేల 474 సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణ పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంద న్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధికి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బొత్స వాసుదేవరావునాయుడు, కోండ్రు జగదీష్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరి గణేష్, గురవాన నారాయణరావు, శాసపు రమేష్ కుమార్, వంగా వెంకటరావు, సమతం శ్రీను, చెలికాని మహేష్ బాబు, దుప్పలపూడి శ్రీను, టంకాల కన్నంనాయిడు, జయరాం, గున్న రమేష్, బలిమి ఉమా, లచ్చుభుక్త కృష్ణమూర్తి, బనిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

# ఆలయాల పరిరక్షణ మన బాధ్యత

*** డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు * జిల్లాలోని ప్రముఖ ఆలయాలను సందర్శించుకున్న డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29 (వార్త):** ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యతని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన అరసవిల్లి, శ్రీకూర్మం దేవాలయాలను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరులు డాక్టర్ గొండు గంగాధర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వారికి అధికారులు, అర్చకులు ఆలయాల విశిష్టతను వివరించారు. డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ ఆలయాలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలన్నారు. పూర్వీకులు ఆలయాలను ప్రత్యేక కళల కోసం వినియోగించుకునేవారని, అలాంటి ఆలయాలు సంస్కృతికి సంపదలుగా గుర్తించాలని చెప్పారు. ఆధ్యాత్మిక నిలయాలకు మారుపేరుగా నిలిచే ఆలయాలను



పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో
# బీసీలకు అన్యాయం

**ఎల్ఎన్‌పేట/హిరమండలం, ఏప్రిల్ 29 (వార్త):** కూటమి ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని హిరమండలం మండలం వైసీపీ అధ్యక్షుడు మీసాల వెంకటరామ కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో బీసీలకు సబ్సిడీ రుణాలు అందడం లేద న్నారు. కేవలం టీడీపీకి చెందిన వారికే బీసీ కార్పొరేషన్ రుణాలు, కుట్టుమిషన్ల పంపిణీ చేస్తున్నారని తెలిపారు. హిరమండలం మండలంలో 422 లబ్ధిదారులు బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకుంటే కేవలం 36 యూనిట్లు మాత్రమే మంజూరైందని, మిగతా 386మందికి లబ్ధి కలగలేదన్నారు. ఇది దురదృష్టకమన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందని ఆ నాయకులు మాయమాటలు చెబుతున్నారే తప్ప న్యాయం చేయడం లేదన్నారు. ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు అర్హులైన ప్రతి ఒక్క బీసీలకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. ప్రతి పథకం కూడా రాజకీయాలకు అతీతంగా అమలు చేశారన్నారు. బీసీ మహిళలకు కుట్టు మిషన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటన ఇస్తే హిరమండలం మండలంలో 195 అప్లికేషన్లు దరఖాస్తు చేశారని, కేవలం 91 మంది టీడీపీ కార్యకర్తలకే ఎంపిక చేశారన్నారు. ప్రజలు దీన్ని గమనిస్తున్నార న్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని రామకృష్ణ తెలిపారు.



## మహిళల ఆర్థిక ఎదుగుదలే..
# కూటమి ప్రభుత్వం లక్ష్యం

*** పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**
*** ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం**

**ఎల్ఎన్‌పేట/హిరమండలం, ఏప్రిల్ 29 (వార్త):** హిరమండలం మండల కేంద్రంలో గల హైస్కూల్లో మహిళల కోసం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. రోజుకు నాలుగు గంటల పాటు





టైలరింగ్ శిక్షణ అందించనున్నారని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధిని పొందడమే కాకుండా, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా స్థిరపడవచ్చుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కడపలవాని గెడ్డ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

మిరియాపల్లి వయా తురకపేట-దబ్బపాడు రోడ్డులో కడపలవాని గెడ్డపై కాంక్రీట్ స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఎస్‌డిఎంఎఫ్ 67 లక్షలు వ్యయంతో దీని నిర్మాణం చేపట్టనున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు శంకుస్థాపనకు పరిమితం చేసిన కడపలవాని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి గ్రామ ప్రజలకు అంకితం చేస్తానన్నారు.

## ఎకువూరులో మెరైన్ పోలీసుల పల్లెనిద్ర



**సోంపేట, ఏప్రిల్ 29 (వార్త):** సోంపేట మండలంలోని ఎకువూరులో బారువా మెరైన్ సీఐ డీవీజే రమేష్ కుమార్ మంగళవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సమస్యలను మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు సూరాడ బైరాగి, చీకటి హరినారాయణ, తోట భోగరాజు, కొండ ముకుందరావు, బైపల్లి గున్నయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గొడ్డలితో దాడి



**సంతబొమ్మాళి, ఏప్రిల్ 29(వార్త):** మండలంలో నౌపడ గ్రామానికి చెందిన దుక్క సంతోష్ కుమార్‌పై అదే గ్రామానికి చెందిన జీరు శంకర్ రెడ్డి గొడ్డలితో సోమవారం రాత్రి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుక్క రమేష్ స్నానం చేస్తుండగా ఆ నీరు జీరు శంకర్‌రెడ్డి ఇల్లు ముందుకు వెళ్లడంతో గొడవ జరిగింది. ఇరువురి మధ్య వాగ్వివాదం జరుగుతున్న సమయంలో రమేష్ అన్న కుమారుడు సంతోష్‌కుమార్ వచ్చి ఇరువురికి నచ్చజెప్పి ప్రయత్నం చేశాడు. మద్యం మత్తులో ఉన్న శంకర్ రెడ్డి తన ఇంట్లో ఉన్న గొడ్డలిని తెచ్చి సంతోష్‌కుమార్ తలపై దాడి చేయగా తీవ్ర గాయమైంది. గాయపడిన సంతోష్ కుమార్‌ను నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నౌపడ పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన జీరు శంకర్ రెడ్డి పరారయ్యారు.

## లారీ టైరుకు నిప్పు

**బూర్జ, ఏప్రిల్ 29 (వార్త):** బూర్జ మండలం పెద్దపేట జంక్షన్ ప్రధాన రహదారి వద్ద లారీ టైర్లకు నిప్పు అంటుకొని కాలిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పాలకొండ వైపు నుండి వస్తున్న లారీ వెనక టైర్లకు నిప్పు అంటుకున్నాయి. ఇది గమనించిన డ్రైవర్ లారీలను ముందుకు నడిపాడు. పెద్దపేట జంక్షన్ వద్దకు చేరుకునేసరికి ఇతర వాహనదారులు డ్రైవర్ను అప్రమత్తం చేయడంతో లారీలు పక్కకు నిలుపుదల చేశారు. పాలకొండ అగ్నిమా కేంద్రానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే లారీలో సరుకు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో లారీ వెనుక టైర్లు పూర్తిగా కాలిపోయాయని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. లారీ టైర్లు రాపిడికి గురి కావడం వల్ల మంటలు ఏర్పడేందుకు అవకాశం ఏర్పడిందని సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**కంచిలి, ఏప్రిల్ 29(వార్త):** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం, కొత్త రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కంచిలి భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆరు ట్రై సైకిళ్లతోపాటు సీపీ చైర్స్, వినికిడి యంత్రాలు అందించారు. మహిళలకు కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కంచిలిలో జూన్ ఒకటో తేదీ నుంచి పది రోజులపాటు నిర్వహించనున్న కంచమ్మ తల్లి సంబరాలు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సంబరాల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఐ మంగరాజు, పాఠశాల ఎస్‌వో రజనీ కుమారి, ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ రమేష్ కుమార్, ఎస్ఐ పారినాయుడు, ఈడీ గడ్డమ్మ, ఎంఈవో పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**పాలకొండ, ఏప్రిల్ 29(వార్త):** గిరిజన గురుకుల రెసిడెన్సియల్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటిడిఏ ఇన్ ఛార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఎస్. శోభిక వెల్లడించారు. మే 18లోగా ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి సంవత్సరం ప్రవేశానికి 800 సీట్లు ఉన్నాయని తెలిపారు. పి.కోనవలస కళాశాలలో (బాలికల కేటగిరి) 140సీట్లు, కురుపాం (బాలికలు), 120 సీట్లు పి.కోనవలస (బాలురు), 140 సీట్లు, భద్రగిరి (బాలికలు) 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546